క్లుప్తంగా

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

వైవీయూ : కడప నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) క్యాలెండర్‌ను కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఆవిష్కరించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరపాలక పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ కడప నగర శాఖ అధ్యక్షుడు సాదిక్‌అలీ, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ టి. రవిశంకర్‌రెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, కలీముల్లా, పద్మాకర్, నజీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సీతారామిరెడ్డి

కడప అర్బన్: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా శుక్రవారం కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మోటార్ వాహనాల చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మార్పు బాలకృష్ణమ్మ ఉద్యమయోధుడు

- ఏపీటీఎఫ్ నాయకులు

వైవీయూ : ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసిన ఉద్యమయోధుడు మార్పు బాలకృష్ణమ్మ అని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన చేసిన ఉద్యమాలు నేటికీ అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, ఈశ్వరచంద్ర, చంద్రశేఖర్, రాజగోపాల్, నాగిరెడ్డి, ఉమాకాంత్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు యాదవ మహా సంఘం ఆత్మీయ సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆటోనగర్‌లోని ప్యారడైజ్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు అఖిలభారత యాదవ మహా సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చల్లా రాజగోపాల్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదవులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి, వాణిజ్య, పారిశ్రామిక పరంగా వెనుకబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించడానికి, అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమ్మేళనంలో పలువురు రాష్ట్ర, జాతీయ యాదవ సంఘం నాయకులు పాల్గొంటారని యాదవులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్టీఎఫ్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

వైవీయూ : కడప నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 8వ తేదీ ఆదివారం నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్. రామాంజనేయులు కోరారు. శుక్రవారం కడప నగరంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం నూతనంగా యూనియన్ ప్రారంభం అవుతోందన్నారు. పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుబ్బరాజు యాదవ్, మురళి, రామలక్ష్మిరెడ్డి, రవిశంకర్, వెంకటసుబ్బయ్య, రామచంద్ర, అయ్యవారురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలను చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర కోరారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరసన దీక్షలు మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెత్తను తరలించేందుకు రూ. కోట్లలో వాహనాలను కొనుగోలు చేసిన ప్రభుత్వం కార్మికుల వేతనాల గురించి పట్టించుకోవడం దారుణమన్నారు. ఏఐటీయూసీ నాయకులు నాగ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా, దశరథ్, బుజ్జమ్మ, రవీంద్ర, మునెమ్మ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

- సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులంతా జగనన్న సైన్యం
- కడప నియోజకవర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్బీ అంజద్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం మద్రాసురోడ్డులోని వైఎస్సార్ ఆడిటోరియంలో కడపలోని ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ జోన్లకు సంబంధించిన డివిజన్ల కార్పొరేటర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ముఖ్యమంత్రి మానసపుత్రికలని పేర్కొన్నారు. ప్రజలు ఏ కార్యాలయాలకు తిరక్కుండా సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా ఇంటికే డోర్ డెలివరి చేసేందుకు ఈ వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ, 2024 ఎన్నికలను ఎదుర్కొనేందుకు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులను నియమించామన్నారు. వారంతా సైనికుల్లా పనిచేసి రాష్ట్రంలో 175కు 175సీట్లు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికీ లక్ష రూపాయల నుంచి రూ.12లక్షల వరకూ లబ్ధి చేకూరిందని, అందుకే ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగి ఉంటేనే ఓటు వేయాలని ధైర్యంగా అడుగుతున్నామన్నారు. 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్ల అధికారంలో ఉన్న టీడీపీ ఈ జిల్లాకు ఏం మేలు చేసిందో చెప్పాలని బహిరంగ సవాల్ విసిరారు.

అందరం కలిసికట్టుగా పనిచేయాలి

వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేస్తే 175కు 175సీట్లు సాధించడం కష్టమేమీ కాదని కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు మాట్లాడుతూ వలంటీర్లు ఎంతో గొప్ప సేవ చేస్తున్నారని, కోవిడ్ సమయంలో వారు అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయన్నారు.

మరో రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చే శక్తి వలంటీర్లకు మాత్రమే ఉందన్నారు. పార్టీ నాయకులు అహ్మద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను నేరుగా అందించే అవకాశం లభించిన వలంటీర్లు ఎంతో గొప్ప అదృష్టవంతులని పేర్కొన్నారు. పార్టీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, జమాల్‌వలీ, పాకా సురేష్, సానపురెడ్డి శివకోటిరెడ్డి, కె. రాజశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, బండి ప్రసాద్, ఎస్ఎండీ షఫీ, జహీర్, చల్లా రాజశేఖర్, బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలో పేరు సరిచేయడానికి రెండేళ్లా!



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్: ఇంటి పట్టాలో పేరు తప్పు వస్తే సరిచేయడానికి రెండేళ్లు సరిపోలేదా అని ఉప ముఖ్యమంత్రి ఎస్బీ అంజద్‌బాషా ప్రశ్నించారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 43వ డివిజన్‌లోని రవీంద్రనగర్ పాత న్యాయ కళాశాల సమీపంలోని ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ పర్వీన్ అనే మహిళ మాట్లాడుతూ తమకు ఇంటి స్థలం మంజూరైందని, పేరు తప్పు ఉందని పట్టా తీసుకొని ఇంతవరకూ ఇవ్వలేదని ఫిర్యాదు చేసింది. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ పేరు సరిచేయడానికి రెండేళ్లు సరిపోలేదా...రెండు రోజుల్లో సరిచేసి ఆమెకు పట్టా అందించండని ఆదేశించారు. అలా ఇవ్వకపోతే తనకు ఫోన్ చేయాలని లబ్ధిదారుకు ఫోన్ నంబర్ రాసి ఇచ్చారు. షేక్ బేగం అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.9.28లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఆయేషా అనే మహిళ మాట్లాడుతూ తాము బాడుగ ఇంట్లో ఉన్నామని, ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరగా, విచారించి ఇవ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. 43, 42 డివిజన్ల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు రెడ్డి ప్రసాద్, చల్లా రాజశేఖర్, మాజీ కార్పొరేటర్లు జమాల్‌వలీ, కరీం జిలానీ, షఫీ, సుబ్బారెడ్డి, పస్తం అంజి, పి. సంపత్, గోపాలక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, మల్లీశ్వరి, తులశమ్మ పాల్గొన్నారు.

శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



ఊంజల సేవలో శివపార్వతులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శివపార్వతులకు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలపై కొలువుదీర్చారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. వివిధ పుష్పాలతోఅర్చించి దశ హారతుల మహా నివేదన, మహా మంగళ హారతి, భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

అంగన్వాడీ కార్యకర్త,ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అర్బన్ పరిధిలో అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప అర్బన్ సీడీపీఓ సునంద ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు సంబంధించి మరియాపురం-2 ఓసీ, గాండ్లవీధి ఓసీ, నకాష్-2 బీసీ-ఈ, పక్కీరుపల్లె హెచ్‌డబ్ల్యూ మైనర్ లోకో మోటారు ఓహెచ్ వారికి, కందిపాలెం ఎస్టీ, ప్రకాశ్‌నగర్-3 బీసీ-డి వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా పోస్టులకు సంబంధించి సున్నపురాళ్లపల్లె మిట్ట-ఓసీ, రామచంద్రాపురం-ఓసీ, ఆర్వీనగర్-ఓసీ, పాత బస్టాండు-2 ఓసీ, మరియాపురం-1 ఎస్సీ, ఆర్ఆర్ కల్యాణ మండపం-ఓసీ, కృష్ణ కాలువ గట్టు బీసీ-బీ, వికలాంగుల కాలనీ బీసీ-సి, బెల్లంమండివీధి-ఓసీ, అశోక్‌నగర్-బీసీ-డి, రజకకాలనీ- బీసీ-బి, మరియాపురం-2 బీసీ-ఏ, సాయిపేట 8-1 బీసీ-ఇ, ఎర్రముక్కపల్లె-బీసీ-డి పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 11లోగా ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని, 12న ఉదయం 11 గంటలకు కడప ఆర్డీఓకార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంధుల వెలుగు బ్రెయిలీ



లూయిూ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆరు చుక్కల స్పర్శ లిపితో అంధులకు విద్యాదానం చేసిన మహనీయుడు లూయిూ బ్రెయిలీ అని ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కొనియాడారు. స్థానిక అంగడివీధిలోని అనాథ వికలాంగుల సేవా కేంద్రంలో శుక్రవారం బ్రెయిలీ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.కమాల్ బాష లూయిూ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. సంస్థ సభ్యులు గోపాల్, వీరేష్, ఖాజావలీ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు అందించాలి

- డీసీసీబీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

వైవీయూ: రైతులకు సకాలంలో రుణాలు అందించి, తోడ్పాటు అందించాలని కడప జిల్లా సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సూచించారు. శుక్రవారం కడప నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో అగ్రికల్చర్ జేడీ ఎ. నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లాలో సాగుచేస్తున్న పంటలకు సంబంధించిన సాగు చేసే పంటల వ్యయంకు తగ్గట్టుగా బ్యాంకులు రుణసౌకర్యం కల్పించి సహకారం అందించాలని సూచించారు. జేడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ ఎస్. దుర్గాప్రసాద్, నాబార్డు డీడీఎం విజయవిహారి, డీసీసీ బ్యాంకు సీఈఓ కె. రాజేంద్రకుమార్, ఆదర్శ రైతులు ఎస్. సుబ్బారెడ్డి, రంగారెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, రత్నం పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే చక్కటి అవకాశాలు

- వైవీయూ సహ ఆచార్యులు సునీత



విజేతలతో అతిథులు

కడప స్పోర్ట్స్ : క్రీడల్లో రాణించడం ద్వారా విద్య, ఉద్యోగాల్లో చక్కటి రిజర్వేషన్ సౌకర్యం పొందవచ్చని వైవీయూ సహ ఆచార్యులు డా.ఎస్. సునీత పేర్కొన్నారు. శుక్రవారం కడప ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రీజినల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ సి.హెచ్. జ్యోతి మాట్లాడారు. అనంతరం రెండోరోజు లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసకు మద్దతుగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో జరుగుతున్న సమావేశంలో వారు కరపత్రాలు పంచి వెన్నపూస అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి, వేయించి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రాము, ప్రసాద్, మల్లేశ్వరరెడ్డి, ఎస్. వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. నారాయణ, చైతన్య, బాలవికాస్ స్కూళ్లలో కూడా వారు ప్రచారం నిర్వహించారు.

విశేష అలంకారంలో సత్యదేవుడు



శ్రీ సోమసుందరేశ్వరస్వామి, అమ్మవారు



ఏకాదశ రుద్ర అన్నాభిషేకం

కడప సెవెన్‌రోడ్స్ : నగరంలోని గడ్డిబజారులోగల బాలాజీ దేవాలయంలోని శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామికి ధనుర్మాసం, పుష్యశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని విశేష నవకలశ స్నపన తిరుమంజనం అలంకారం చేశారు. ఉదయం 7 నుంచి సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

లలితా సహస్ర నామార్చన

శ్రీ సోమసుందరేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి శ్రీ కామకోటి కళాంబదేవి అమ్మవారికి లలితా సహస్ర నామార్చన, శ్రీ సోమసుందరేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు క్రమశిక్షణతో శ్రమించాలి

- సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి

వైవీయూ : ప్రతి విద్యార్థి తనకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో శ్రమించి సాధించాలని సమగ్రశిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు అధికారి ఎ. ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం అన్న అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, కోశాధికారి సనావుల్లా, శంకరయ్య, కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 1ను వెంటనే రద్దు చేసి రాజ్యాంగ హక్కులను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. జీఓ 1ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో వివిధ అఖిల పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. జీఓ 1ని రద్దు చేయాలని కోరుతూ శనివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. అఖిలపక్ష పార్టీల నాయకులు సత్తార్, చంద్రశేఖర్, నాగ సుబ్బారెడ్డి, గుర్రప్ప, మగ్బూల్ బాషా, ఆంజనేయులు, మునెయ్య పాల్గొన్నారు.

అవ్వాతాతల ఆనందమే సీఎంకు సంతోషం

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : అవ్వా తాతలు ఆనందంగా ఉండటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంతోషం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీడీఓ శేషాచలపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నూతనంగా మంజూరైన 239 మంది లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఎంత నగదు ఇచ్చినా తక్కువేనని సీఎం భావన అని, అందుకే సీఎంగా తొలి సంతకం పింఛన్ల పంపిణీపై చేశారన్నారు. ఈనెల నుంచి రూ.2750 ఇస్తున్నారని, వచ్చే సంవత్సరం రూ.3 వేలు చేస్తారన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

ముఖ్యమంత్రి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ.80లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతకు ముందు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు...

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని అక్కంపేట, మీరాపురం, కుప్పూరువారిపల్లెతో పాటు పట్టణంలోని 10, 11వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు.

మహిళా కళాశాలలో పట్టాభిషేక వేడుక

మహిళా సాధికారతే ధ్యేయంగా జిల్లాలో ఏర్పాటైన ఏకైక మహిళా డిగ్రీ కళాశాల. ఈ కళాశాల ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాలోని మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. స్త్రీ విద్య అభ్యున్నతికి జిల్లాలో ఏర్పాటైన ఈ విద్యాలయంలో తొలిసారిగా శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నారు.



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

వైవీయూ: కోటిరెడ్డి రామసుబ్బమ్మ చొరవతో కోర్టు భవన సముదాయంలో 1973లో జిల్లాలో మొట్టమొదటి మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేశారు. చాలా కాలం పాటు కోర్టు భవనాల్లో కళాశాల నిర్వహించారు. 3.5 ఎకరాల స్థలంలో ప్రస్తుత కళాశాల ఏర్పాటు చేశారు. అనంతరం ఇటీవల కాలంలో కోటిరెడ్డి, రామసుబ్బమ్మల తనయుడు ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జయభారత్‌రెడ్డి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం దాదాపు రూ.1 కోటి వెచ్చించి హాస్టల్‌సైతం అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. 2004లో జిల్లాకు చెందిన వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కళాశాల దశ మారింది. 2.5 కోట్ల నిధులు విడుదల చేయడంతో పాటు స్వయాన ముఖ్యమంత్రిహోదాలో 2005లో ఆయనే శంకుస్థాపన చేశారు. 2008 నాటికి నూతన భవనాలు పూర్తయి కళాశాల సరికొత్త రూపును సంతరించుకుంది. అనంతరం 2014లో కళాశాల న్యాక్ బీ గ్రేడ్ సాధించడంతో పాటు స్వయంప్రతిపత్తి హోదాను సాధించింది. ప్రస్తుతం రెండోసారి న్యాక్ కోసం సన్నద్ధం అవుతున్నారు.

తొలిసారిగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు..

ఇప్పటి వరకు డిగ్రీ, పీజీ సర్టిఫికెట్‌కు సంబంధించిన విశ్వవిద్యాలయాలే స్నాతకోత్సవాలు నిర్వహించి పట్టాలు ప్రదానోత్సవం చేసేవారు. కళాశాల విద్య కమిషనరేట్ ఆదేశాల మేరకు గతేడాది నుంచి స్వయంప్రతిపత్తి హోదా కలిగిన కళాశాలలు సైతం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ తదితరులు విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : కడప రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వల్లూరు, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, పెండ్లిమర్రి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు, మినీ అంగన్ వాడీ కార్యకర్త పోస్టులకు ఈనెల 11వ తేదీ లోపు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరు మండలంలో పెద్దలేబాక అరుంధతివాడ(ఓహెచ్), అంగన్‌వాడీ కార్యకర్త, చిన్నపుత్త (బీసీ-సీ), కుముద్‌బెన్ జోసినగర్(ఎస్టీ), చిన్ననాగిరెడ్డిపల్లె(ఓసీ), బీచువారిపల్లె దళితవాడ(ఎస్సీ). అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా వున్నాయి. అలాగే పెండ్లిమర్రి మండలంలో రామచంద్రాపురం (ఓసీ), వేలూరుపాడు(ఎస్టీ), నందిమండలం మెయిన్(ఓసీ ఈడబ్ల్యూఎస్), అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా వున్నాయి. అలాగే చింతకొమ్మదిన్నె మండలంలో ఏఎల్ కాలనీ (ఎస్టీ), ఇందిరానగర్-1(బీసీ-ఈ) అంగన్ వాడీ కార్యకర్త పోస్టులు. బోడెద్దులపల్లె (బీసీ -ఈ), బాబానగర్ (ఓసీ), అంగడివీధి-1(బీసీ-ఈ), సీకేదిన్నె బీసీ కాలనీ(బీసీ -ఏ), ఇందిరానగర్-1(బీసీ-బీ), బలిజపల్లె ఎస్టీ కాలనీ(ఎస్టీ) అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు. ఆర్ఎన్‌వైకాలనీ(ఎస్టీ) మినీ అంగన్ వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా వున్నాయని తెలిపారు.

9న వాలీబాల్ పోటీలు

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 9వ తేదీన వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్ర, మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9వ తేదీ 9గంటల లోపు 91605 31136, 95509 21600యు నెంబర్లకు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన అందులో పేర్కొన్నారు.